నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

ఓడిపోయితిమని ఒకయించుకైనను
చింతవలదు సుమ్ము చిత్తమందు
కారణములు తెలిసి కాసింత శ్రద్ధతో
సాధనమ్ము జేయ సఫలమగును

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


# నీలగిరి ఎక్స్‌ప్రెస్
RNI - TELTEL/2023/87644
తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 22 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 30-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00




# ఐపీఎల్ ఫైనల్లోకి గుజరాత్

- కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సెంచరీ
- సాయి సుదర్శన్ హాఫ్ సెంచరీ
- సూర్యవంశీ 96 పరుగుల పోరాటం వృథా

**క్వాలిఫయర్ 2లో రాజస్థాన్ రాయల్స్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపు**



హైదరాబాద్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (104) బాధ్యతాయుతంగా ఆడి అద్భుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. సాయి సుదర్శన్ అర్ధసెంచరీతో రాణించాడు.

-మిగతా 2 లో



# పదవి పోయినా పెత్తనం నాదే..

- ఢిల్లీలో చక్రం తిప్పుతున్న సిద్ధూ
- సమన్వయ కమిటీ కోసం పట్టు
- తనయుడికి కీలక శాఖలు కేటాయించాలని డిమాండ్

బెంగళూరు, మే 29

కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రిగా ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగా కనిపిస్తుండగా కొత్త ప్రభుత్వం ఏర్పడేంతవరకు తాత్కాలిక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య కొనసాగనున్నారు. ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పదోన్నతికి మార్గం సుగమం చేసేందుకు తన పదవికి రాజీనామా చేసిన సిద్ధరామయ్య పార్టీకి, ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరించేందుకు ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద ప్రతిపాదించినట్లు తెలిసింది. కొత్త మంత్రులతో కలిసి డీకే వచ్చే వారం ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయవచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి.

-మిగతా 2 లో



# సర్ తో అందరికీ సమస్యే

- లంబాడీ, ఆదివాసీ, వలస కార్మికులకు నష్టం
- సర్ తో ఎదురయ్యే సమస్యలపై అవగాహన పెంచుకోవాలి
- దళితులు, మైనారిటీలు, మహిళల ఓట్లు పోయే ప్రమాదం : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్

ప్రత్యేక విస్తృత సవరణ (సర్ )తో లంబాడీలు, ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య అని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని గాంధీభవన్ లో నిర్వహించిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ, పీసీసీ అడ్వైజరీ కమిటీ ఉమ్మడి సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్ పైన అందరు అవగహన పెంచుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సర్ వల్ల సామాన్యులు, పేదలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాబోతున్నాయో నాయకులు గుర్తించడం మంచి పరిణామమని అభినందించారు. సర్ లంబాడీ లు ,ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య కావొచ్చన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ప్రజలు పెద్ద ఎత్తున వలస పోయారనీ, అలాంటి వారితో పాటు మహిళలకు కూడా సర్ వల్ల సమస్యలు ఎదురుకావొచ్చని చెప్పారు. సర్ కారణంగా దళితులు,

-మిగతా 2 లో

# ప్రతి గింజా కొంటాం

## రైతులు ఆందోళన చెందొద్దు

- అబద్ధపు ప్రచారాన్ని నమ్మొద్దు
- తడిసిన ధాన్యం 9 వేల మెట్రిక్ టన్నులు కొన్నాం
- ధాన్యం సరఫరాకు ఇసుక, సిమెంట్ లారీలు, డీసీఎంలను సమకూర్చాం
- రెండు లక్షల మంది సిబ్బంది పని చేస్తున్నారు
- బీజేపీది రైతు ఘోష యాత్ర కాదు... ? అధికార ఘోష యాత్ర : మంత్రులు
- ఎన్ ఉత్తమ్, తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్

ఇటీవల కురిసిన వర్షాలకు తడిన తడిసిన ధాన్యాన్ని 9వేల మెట్రిక్ టన్నులను కొన్నామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ధాన్యం సరఫరాకు ఇసుక, సిమెంట్ లారీలు, డీసీఎంలను సమకూర్చామని తెలిపారు. ధాన్యం సేకరణలో దాదాపు రెండు లక్ష?ల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. 2008 రైస్ మిల్లులలకు 13వేల వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు. 20.86 కోట్ల గన్నీ బ్యాగులు

-మిగతా 2 లో






# కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు

- అమెరికా యుద్ధ విమానాన్ని కూల్చేశాం: ఇరాన్
- అలాంటిదేమీ లేదన్న యూఎస్

టెహ్రాన్

అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. రెండు దేశాలూ పరస్పర దాడులకు దిగడంతో పశ్చిమాసియాలో మళ్లీ ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్ అధికారిక మీడియా ఒక కీలక ప్రకటన చేసింది. అమెరికాకు చెందిన ఓ యుద్ధ విమానాన్ని కూల్చేశామని ప్రకటించింది.

-మిగతా 2 లో



# రైతు డిస్కం ప్రభుత్వ కుట్ర

- రైతుల భవిష్యత్తును ఆగం చేసే ప్రతిపాదన
- ఈఆర్సీ దీనిని రిజెక్ట్ చేయాలి
- రైతు డిస్కంపై పబ్లిక్ హియరింగ్‌లో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్

రైతు డిస్కం పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచే కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రైతులు అడగకుండానే విద్యుత్ సంస్కరణల పేరుతో చేపట్టిన ఈ చర్య రైతుల పాలిట

-మిగతా 2 లో

# ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత

- క్యూఆర్ పరిధిలో సంతృప్తినిచ్చే ఇళ్ల డిజైన్
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్

పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

-మిగతా 2 లో

# యూపీఎస్సీని చూసి బుద్ధి తెచ్చుకోండి

**కేంద్రంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం**


- నీట్ పేపర్ లీకేజీ అత్యంత బాధాకరం
- యువతను నిరాశపరచడం మంచిది కాదన్న ధర్మాసనం
- ప్రత్యేక అఫిడవిట్ దాఖలుకు కేంద్ర ప్రభుత్వానికి ఆదేశం

న్యూఢిల్లీ,

నీట్ యూజీ-2026 పేపర్ లీక్ కేసుపై సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటువంటివి జరగడం చాలా బాధాకరమని సుప్రీంకోర్టు పేర్కొన్నది. నిజమైన జవాబుదారీతనం ఏర్పడే వరకు అసలు సమస్య ఆగదని స్పష్టం చేసింది. మనం మన యువతను నిరాశపరచకూడదని తెలిపింది. నీట్ పరీక్షల నిర్వహణ, ముగింపు ప్రక్రియను ప్రతి ఏటా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ద్వారా సంస్థాగతం చేసే

-మిగతా 2 లో





# ప్లాస్టిక్ కరెన్సీ నోట్లపై దృష్టి పెట్టిన ఆర్బీఐ!

- ముద్రణ ఖర్చు తగ్గించే దిశగా కీలక కసరత్తు!
- పాలిమర్ నోట్లే పరిష్కారమని భావిస్తున్న ఆర్‌బీఐ!
- ఏటా వేల కోట్ల విలువైన కరెన్సీ రద్దు:
- ప్లాస్టిక్ నోట్లతో ఆ నష్టాన్ని నివారించే యోచనలో బ్యాంక్.
- త్వరలో పాలిమర్ కరెన్సీ పైలట్ ప్రాజెక్ట్
- ఏటీఎంలలోనూ ఈజీగా పంపిణీకి ఆర్‌బీఐ ప్రణాళిక!

న్యూఢిల్లీ

పాలిమర్ లేదా ప్లాస్టిక్ కరెన్సీ నోట్ల ను ప్రవేశపెట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిసింది. రోజు రోజుకూ కరెన్సీ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో.. పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టేందుకు ఆర్బీఐ ప్లాన్ వేసింది. ఇటీవల పాట్నా, ముంబైలో జరిగిన ఆర్బీఐ బోర్డు సమావేశాల్లో పాలిమర్ నోట్ల గురించి చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పాలిమర్ లేదా ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టేందుకు విస్తృతంగా చర్చించారు. పాలిమర్ నోట్లకు ఎక్కువ సెల్ఫ్ లైఫ్ ఉంటుందని, తయారీ కోసం తక్కువ ఖర్చు అవుందని భావిస్తున్నారు. సంప్రదాయకర కాగితం కరెన్సీ తయారీకి ఎక్కువ ఖర్చు అవుతుంది. అంతేకాకుండా పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం వినియోగంలో ఉన్న పేపర్ నోట్ల కన్నా.. పాలిమర్ నోట్ల తయారీకి తక్కువ ఖర్చు అవుతుంది. ఏటీఎంల ద్వారా కూడా

-మిగతా 2 లో



# కార్యకర్తల కృషితోనే మహానాడు ఘన విజయం

- ప్రతి పల్లె, ప్రతి ఇల్లు మహానాడు వేదికగా మారింది
- మై టీడీపీ యాప్‌లో 24.50 లక్షల డిజిటల్ అటెండెన్స్ నమోదు
- మహానాడు చరిత్రలో కొత్త రికార్డు సృష్టించింది
- మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల తీర్మానానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు
- ప్రతి ఒక్కరి కృషికి శిరస్సువంచి నమస్కరిస్తున్నా
- కార్య నిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేష్

అమరావతి

తెలుగుదేశం పార్టీ రెండు రోజుల పాటు నిర్వహించిన మహానాడు 2026 విజయవంతంగా పూర్తయింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేష్ శుక్రవారం స్పందించారు. మహానాడు 2026 విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. తెలుగుదేశం పార్టీ కోట్లాది కుటుంబసభ్యుల ఆశీస్సులతో తాను టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎంపికైన తర్వాత జరిగిన తొలి మహానాడు ఇదని వివరించారు.

-మిగతా 2 లో

# ఐపీఎల్ ఫైనల్లోకి గుజరాత్

మొదటి తరువాయి

రాజస్థాన్ నిర్దేశించిన 215 పరుగుల భారీ లక్ష్యాన్ని గుజరాత్ మరో 8 బంతులు మిగిలి ఉండగానే కేవలం 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ ఏ దశలోనూ తడబడలేదు. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ తొలి వికెట్‌కు 167 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను రాజస్థాన్ నుంచి లాగేసుకున్నారు. ముఖ్యంగా గిల్, రాజస్థాన్ బౌలర్లను ఊచకోత కోశాడు. కేవలం 53 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 104 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు సాయి సుదర్శన్ 32 బంతుల్లో 58 పరుగులు చేశాడు. వీరిద్దరూ అవుటైన తర్వాత రాహుల్ తెవాటియా (17 నాటౌట్) తనదైన శైలిలో మ్యాచ్‌ను ముగించాడు. అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కేవలం 9 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే, యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ వీరోచిత ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. కేవలం 47 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 96 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. అతనికి రవీంద్ర జడేజా (45 నాటౌట్) చక్కటి సహకారం అందించాడు. చివర్లో డొనోవన్ ఫెరీరా (11 బంతుల్లో 38) విధ్వంసం సృష్టించడంతో రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 214 పరుగుల భారీ స్కోరు సాధించింది. గుజరాత్ బౌలర్లలో జాసన్ హోల్డర్, కగిసో రబాడ రెండేసి వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ ఫైనల్‌కు అర్హత సాధించగా, రాజస్థాన్ రాయల్స్ ప్రస్థానం టోర్నీలో ముగిసింది. మే 31న (ఆదివారం) జరిగే టైటిల్ పోరులో గుజరాత్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో తలపడనుంది

# పదవి పోయినా పెత్తనం నాదే..

మొదటి తరువాయి

రాహుల్‌కు కోర్కెల జాబితా

శుక్రవారం ఢిల్లీ చేరుకున్న సిద్ధరామయ్య పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని కలుసుకుని తన డిమాండ్ల జాబితాను సమర్పించినట్లు తెలిసింది. డీకే శివకుమార్ నేతృత్వంలోని కొత్త క్యాబినెట్‌లో తన కుమారుడు యతీంద్రకు కీలక శాఖలు కేటాయించాలని ఆయన కోరినట్లు సమాచారం. సిద్ధరామయ్య క్యాబినెట్‌లో పీడబ్ల్యూడీ మంత్రిగా పనిచేస్తున్న సతీష్ జార్కిహోళికి కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవిని అధిష్ఠానం ఆఫర్ చేసినట్లు వర్గాలు తెలిపాయి. అయితే తన రాజకీయ గురువు సిద్ధరామయ్యతో చర్చించిన తర్వాత తన నిర్ణయం తెలియచేస్తానని ఆయన చెప్పినట్లు సమాచారం. కాగా, సిద్ధరామయ్య డిమాండ్లలో ఎన్నిటిని అధిష్ఠానం ఆమోదిస్తుందన్న విషయం ఆసక్తికరంగా మారింది.

జూన్ 3న డీకే ప్రమాణం

కర్ణాటక ముఖ్యమంత్రిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డీకే శివకుమార్ జూన్ 3న ప్రమాణం చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. సీఎం సిద్ధరామయ్య ఈ నెల 28న (గురువారం) తన పదవికి రాజీనామా చేయగా శుక్రవారం గవర్నర్ తావర్‌చంద్ గెహ్లోట్ దాన్ని ఆమోదించడంతో డీకే ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

# కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు

మొదటి తరువాయి

అయితే, ఈ ప్రకటనను అమెరికా ఖండించింది. టెహ్రాన్ చెప్తున్నట్టుగా అలాంటిదేమీ లేదని కొట్టిపారేసింది. శుక్రవారం తెల్లవారుజామున బుషెహర్ ప్రావిన్స్‌లోని జామ్ ప్రాంతంలో శత్రు దేశానికి చెందిన ఓ యుద్ధ విమానాన్ని అడ్డగించినట్టు టెహ్రాన్ మీడియా తెలిపింది. ఇరాన్ వైమానిక దళాలు ఆ ఫైటర్‌జెట్‌ను కూల్చివేశాయని స్థానిక గవర్నర్‌ను ఉటంకిస్తూ వెల్లడించింది. ఈ ఘటనలో ఎవరైనా ప్రాణాలు కోల్పోయారా.. లేదా అనే పూర్తి వివరాలను మాత్రం అది వెల్లడించలేదు. ప్రస్తుతం బుషెహర్ ప్రాంతంలో పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చాయని తెలిపింది. మరోవైపు, దాడుల్లో యుద్ధ విమానం కూలిపోతున్న ఓ ఫొటోను ఇరాన్ ఆర్మీ ఎక్స్ ఖాతాలో పంచుకుంది. అయితే, ఈ వాదనలను అమెరికా సెంట్రల్ కమాండ్ తోసిపుచ్చింది. బుషెహర్ ప్రావిన్స్ సమీపంలో అమెరికా విమానాన్ని కూల్చేశామంటూ ఇరాన్ మీడియా అసత్య ప్రచారం చేస్తోందని వెల్లడించింది.

# రైతు డిస్కం ప్రభుత్వ కుట్ర

మొదటి తరువాయి

శాపంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు డిస్కం ఏర్పాటుపై తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ శుక్రవారం ఎర్రగడ్డలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ హియరింగ్ లో కవిత పాల్గొని మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రైతులకు మంచి చేసే ఆలోచనలో ఉంటే ఆరు నెలలుగా ఈ విషయాన్ని ఎందుకు దాచి ఉంచిందో చెప్పాలన్నారు. ఈ అంశంపై 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఏ విధంగానూ వయబుల్ కాని ఈ ప్రపోజల్ ను తిరస్కరించాలని ఈఆర్సీకి విజ్ఞప్తి చేశారు. ఇంతటి కీలకమైన అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి అసెంబ్లీలో చర్చ పెట్టాలన్నారు. అసలే డిస్కం ల పరిస్థితి బాగాలేని సమయంలో రూ. 25 వేల కోట్ల నష్టంతో ఉన్న డిస్కం ను కంపెనీ పేరుతో ఎలా రిజిస్టర్ చేస్తారని ఆమె నిలదీశారు. డిస్కం ల బకాయిలు రూ. 69 వేల కోట్లు ఉంటే అందులో 54 వేల కోట్ల బకాయిలు ప్రభుత్వం నుంచే రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు చెల్లిస్తే మన డిస్కం లు మంచి రేటింగ్ లోకి వస్తాయని చెప్పారు. పైగా కొత్త డిస్కం కు యూనిట్ 6 రూపాయలు ఖర్చయ్యే థర్మల్ విద్యుత్ ను కేటాయిస్తున్నారని చెప్పారు. ఉచిత విద్యుత్, లిఫ్ట్ ఇరిగేషన్ విద్యుత్, రైతులకు ఇచ్చే విద్యుత్ కు డబ్బులు ఇవ్వాల్సి ఉన్నా కే రూ. 54 వేల కోట్ల పెండింగ్ పెట్టిన ప్రభుత్వం కొత్త డిస్కం కు ఎక్కడ నుంచి డబ్బులు ఇస్తుందని ప్రశ్నించారు డిస్కంల నష్టాలను సాకుగా చూపి ఒక డిస్కం ను ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నారన్నారు. అటు రైతుల మోటార్లకు మీటర్లు పెట్టమని చెప్పి ఇప్పుడు మాత్రం ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు ప్రభుత్వ వైఖరి కనిపిస్తుందన్నారు ఈఆర్సీ నుంచి ఎలాంటి అనుమతి రాకుండానే జూన్ 2 నుంచి కొత్త డిస్కం పని

## ప్లాస్టిక్ కరెన్సీ నోట్లపై దృష్టి పెట్టిన ఆర్బీఐ!

మొదటి తరువాయి

ఈజీగా పాలిమర్ నోట్లను పంపిణీ చేయవచ్చు అన్న ఆలోచనలో ఆర్బీఐ ఉంది.పాలిమర్ కరెన్సీ నోట్లకు చెందిన పైలట్ ప్రాజెక్టును ఆర్బీఐ త్వరలో ప్రకటించనున్నది. పేపర్ మనీ ప్రింటింగ్ కోసం అయ్యే ఖర్చు బాగా పెరిగిపోయిందని, 5101.4 కోట్ల నుంచి 6,372.8 కోట్లకు ఆ ఖర్చు చేరుకుందని ఇటీవల ఆర్బీఐ వార్షిక నివేదికలో పేర్కొన్నది. బ్యాంక్ నోట్ల ప్రింటింగ్ కోసం డిమాండ్ పెరగడం వల్ల ఖర్చు పెరిగినట్లు నివేదికలో తెలిపారు. ఇక పాడైన, పాతబడిపోయిన, చిరిగిన పేపర్ కరెన్సీ నోట్ల సంఖ్య కూడా పెరిగిపోయింది. 2025 వార్షిక సంవత్సరంలో సుమారు 23.8 బిలియన్ల చిరిగిన నోట్లను రద్దు చేశారు. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 12.3 శాతం అధికం. 2024 వార్షిక సంవత్సరంలో సుమారు 21.24 బిలియన్ల చిరిగిన కరెన్సీ నోట్లను రద్దు చేసినట్లు తెలిసింది. 500, 100 నోట్లు ఎక్కువగా రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. 1988లో తొలిసారి ఆస్ట్రేలియా పాలిమర్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టింది. 1996 నాటికి ఆ దేశం పూర్తి స్థాయిలో పాలిమర్ నోట్లను వినియోగంలోకి తెచ్చింది. ఇక కెనడా 2011లో పాలిమర్ కరెన్సీ నోట్లను తెచ్చింది. అయితే పేపర్ కన్నా పాలిమర్ బెటర్ అని కెనడా అనేక విశ్లేషణలు చేసింది.

# ప్రతి గింజా కొంటాం

మొదటి తరువాయి




అందుబాటులో ఉన్నాయన్నారు. కానీ ప్రతిపక్ష?లు ధాన్యం సేకరణలో దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ రఘురామ్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి మంత్రి విలేకర్లతో మాట్లాడారు. స్వతంత్ర భారత దేశంలోనే ఎన్నడూ లేని విధంగా తెలంగాణలో అత్యధిక ధాన్యాన్ని సేకరించిందని గుర్తు చేశారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే తన నివేదికల్లో పేర్కొందని తెలిపారు. పదేండ్ల కాలంలో సేకరించిన పోల్చితే ఎక్కువగా కాంగ్రెస్ ప్రభుత్వం సేకరించిందన్నారు. కేంద్రం సర్కారు నిర్ణయించిన మద్దతు ధర నిబంధలు పాటిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని విమర్శించారు. అయినా రూ. 16,479 కోట్లు అదనంగా చెల్లించి కొనుగోలు చేశామని చెప్పారు. కాళేశ్వరం, సుందిళ్ల రిజర్వాయర్ ఉపయోగించకుండానే అత్యధిక పంట ఉత్పత్తి జరుగుతోందన్నారు. చివరి గింజా వరకు కొనుగోలు చేస్తామన్నారు. యాసంగిలో 1.41 లక్ష?ల మెట్రిక్ టన్నులు వరి ఉత్పత్తి అవుతోందనీ, అందులో 75 లక్ష?ల మెట్రిక్ టన్నుల సేకరిస్తామన్నారు. కానీ 52 లక్ష?ల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తీసుకుంటాం. మిగతాది తీసుకోలేమంటూ కేంద్రం మెలిక పెట్టిందని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని కొని కూడా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామన్నారు. తెలంగాణలో కూలీలు పని చేయడం లేదనీ, పూర్తిగా బీహర్ హమాలీలపై ఆధారపడి ఉందన్నారు. బీహార్‌లో వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడం, బెంగాల్ ఎన్నికల నేపథ్యంలో కూలీల కొరత ఏర్పడిందన్నారు. ధాన్యం కొనుగోళ్లకు బీఆర్ఎస్ సర్కారు రూ. 15వేల కోట్లు ఖర్చు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి రూ. 49వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. గత ప్రభుత్వం 7వేల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ సర్కారు 8575 కేంద్రాలు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ధాన్యం కొనుగోళ్లకు 2024-25లో రూ. 36,143 కోట్లు, 2025-26లో రూ.39,359 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఆ సొమ్మును 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు.

# సర్ తో అందరికీ సమస్యే

మొదటి తరువాయి

మైనారిటీలు, మహిళల ఓట్లు పోయే ప్రమాదముందని అప్రమత్తం చేశారు. సర్ వల్ల తలెత్తే సమస్యలకు పరిష్కారంపైన సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. బూత్ ఎన్ రోలర్ సాయంతో గతంలో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ మెంబర్ షిప్ చేయించామనీ, ఎక్కువ సభ్యత్వం నమోదు చేయించిన వారికి రాహుల్ గాంధీ తో సన్మానం చేయించామని ఆయన గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ సభ్యత్వంలో కీలక పాత్ర పోషించిన ఎన్ రోలర్స్ ను స ర్ విషయంలో పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. డిజిటట్ మెంబర్ షిప్ కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక ఇన్ చార్జీని నియమించి నిరంతరం పర్యవేక్షించామని తెలిపారు. సర్ కోసం 119 నియోజకవర్గాలు, 17 లోక్ సభ నియోజకవర్గాలకు ఇన్ చార్జీలను నియమించాలనీ, అసెంబ్లీ ఇన్ చార్జీలు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందేనని దిశానిర్దేశం చేశారు. ఇన్ చార్జీలు సరిగ్గా పని చేస్తే ఒక్క ఓటు కూడా?తొలగించకుండా అడ్డుకోవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. ఇన్ చార్జీ మంత్రులు ప్రతి 10 రోజులకు ఒక రోజు పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా పనిచేయాలనీ, క్షేత్ర స్థాయికి వెళ్లి కార్యకర్తలను కలవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తాను కూడా 10 రోజులకోసారి క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలను కలుస్తాననీ, నెలలో మూడు రోజులు పార్టీ కార్యకర్తల కోసం సమయం కేటాయిస్తానని తెలిపారు. తనతో పాటు ఎవరికి మినహాయింపు ఇవ్వొద్దనీ, పార్టీ కోసం అందరూ పని చేయాల్సిందనని తేల్చి చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మెన్లతో సహా ప్రతి ఒక్కరు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందేనని స్పష్టం చేశారు. మాజీ పీసీసీ అధ్యక్షుల సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. దాదాపుగా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేశామనీ, పార్టీ తరుపున ప్రస్తుతం వేలాది మంది సర్పంచ్ లు, మున్సిపల్ చైర్మెన్లు, కౌన్సిలర్లు ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. వలసలు పోయిన వారి ఓట్లు పోకుండా పార్టీ నాయకులంతా సమన్వయం తో జాగ్రత్త పడాలని కోరారు. నాయకులు క్షేత్రస్థాయికి వెళ్తేనే కార్యకర్తలు బూత్ స్థాయికి వెళ్తారని తెలిపారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలో బాధ్యత అప్పగించాలనీ, నగర పరిధిలోని 15 నియోజకవర్గాల్లో సర్ పైన అసెంబ్లీల వారీగా సమావేశాలు పెట్టాలని సూచించారు. సర్ పైన మహిళా కాంగ్రెస్ తరుపున క్లస్టర్ల వారీ గా సమావేశాలు నిర్వహించాలన్నారు.

# ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత

మొదటి తరువాయి



పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. క్యూఆర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి పలు కీలక మార్పులు, సూచనలు చేశారు. రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాదు... భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించే ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# యూపీఎస్‌సీని చూసి బుద్ధి తెచ్చుకోండి

మొదటి తరువాయి



యంత్రాంగాన్ని రూపొందించే వివరాలను తెలియచేస్తూ ఒక ప్రత్యేక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని కేంద్ర విద్యా శాఖను సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రత్యేక సిబ్బందిని నియమించడం, విస్తృత శ్రేణి నిపుణులను కలిగి ఉండటం ద్వారా ఎన్‌టీఏలో సంస్థాగత నైపుణ్యాన్ని ఎలా అభివృద్ధి చేస్తారో అఫిడవిట్‌లో వివరించాలని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాదేలతో కూడిన ధర్మాసనం పేర్కొన్నది. 2024, 2026 నీట్ పరీక్ష వివాదాల వంటి ఘటనలు పునరావృతం కాకుండా నిరోధించడానికి అవసరమైన భౌతిక, మేధోపరమైన సామర్థ్యాలను ఎన్‌టీఏ కలిగి ఉండేలా చూడటమే ప్రధాన ధ్యేయంగా ఉండాలని కోర్టు పేర్కొన్నది. ఆరు వారాల్లోగా అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. విచారణ సందర్భంగా ఎన్‌టీఏ, ఉన్నత స్థాయి కమిటీ చైర్మన్ డాక్టర్ కే రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

యూపీఎస్‌సీని చూసి నేర్చుకోండి

పర్యవేక్షణ యంత్రాంగాలు, పర్యవేక్షక కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్‌సీ)తో పోలుస్తూ దేశంలోని అత్యున్నత సివిల్ సర్వీసెస్ పరీక్ష అయిన యూపీఎస్‌సీలో ఇలాంటి సంఘటనలు ఎన్నడూ జరగలేదని కోర్టు వ్యాఖ్యానించింది. యూపీఎస్‌సీ వ్యవస్థల నుంచి గుణపాఠాలు నేర్చుకోవలసిన అవసరం ఉందని సూచించింది. ఇస్రో మాజీ చైర్మన్ రాధాకృష్ణన్ కమిటీ అఫిడవిట్‌ను న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది.

# కార్యకర్తల కృషితోనే మహానాడు ఘన విజయం

మొదటి తరువాయి



ఈ మహానాడు ఘన విజయం టీడీపీ టీమ్ కృషి అని స్పష్టం చేశారు. సమష్టిగా పనిచేస్తే ఎన్ని అద్భుతాలు చేయగలమో టీడీపీ కుటుంబం నిరూపించిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుతో నెల్లూరులో జరగాల్సిన మహానాడు 2026ను అందరి అమోదంతో హైబ్రిడ్ విధానంలో మార్చామని మంత్రి లోకేష్ గుర్తు చేశారు. తెలుగుదేశం రాజకీయ పాఠశాలలో గురువు చంద్రబాబు నాయుడు సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మనకు నేర్పారని చెప్పారు. ఆ నేర్పును ఇంటర్నేషనల్ క్రైసిస్‌లో కూడా ఎవరూ ఊహించని విధంగా హైబ్రిడ్ మహానాడు ఒక అవకాశం తీసుకుని విజయవంతం చేశారని సంతోషం వ్యక్తం చేశారు. గతంలో మాదిరి ఒకచోట జరిగే మహానాడుకు తెలుగు రాష్ట్రాల నుంచి టీడీపీ కుటుంబసభ్యులు తరలివచ్చేవారని పేర్కొన్నారు. తెలుగుదేశం నా బాధ్యత అంటూ ఇప్పుడు ప్రతి పల్లె, ప్రతి ఇల్లా మహానాడు వేదిక అయి.. పసుపు జెండాలతో రెపరెపలాడించిందన్నారు. కార్యకర్తలే అధినేతలే.. నేతలే మార్గదర్శులై రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్ల బాధ్యతలను తామే తీసుకుని మహానాడు 2026ను కనివిని ఎరుగని రీతిలో విజయవంతం చేశారని చెప్పారు. స్త్రీ శక్తి ధీమకు అసలైన అర్థం చెప్పేలా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన తీర్మానానికి అందరి అమోదం లభించడం.. ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడం ఈ మహానాడు సాధించిన మరో గొప్ప విజయం అని మంత్రి లోకేష్ అభివర్ణించారు. కార్యకర్తలే అధినేత నినాదాన్ని పార్టీ జాతీయ అధినేత అమలు చేసిన ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రెండు రోజుల మహానాడుకు ఒక్క మై టీడీపీ యాప్‌లో 24.50 లక్షల డిజిటల్ అటెండెన్స్ నమోదు కావడం మరో రికార్డు అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, మహానాడు కమిటీలు, పార్టీ కార్యాలయ యంత్రాంగం, బ్యాక్ ఆఫీస్, సాంకేతిక సిబ్బంది, ఐటీడీపీ, ఐటీడీపీ, అనుబంధ సంఘాలు, మీడియా మిత్రులు, సోషల్ మీడియా అభిమానులు, ఎన్ఆర్ఐలు, మిత్రపక్షాలు, ప్రజలు, భద్రతా సిబ్బంది అందరికీ కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. మహానాడు 2026 విజయం మీ అందరికీ అంకితం చేస్తున్నానని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. ఇది మీ విజయం అని మంత్రి లోకేష్ వెల్లడించారు. మీ కృషికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని చెప్పారు.

## మహిళా సంఘాలకు రూ.4.5 కోట్ల చెక్కుల పంపిణీ



**అమ్రాబాద్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహిళా వారోత్సవాల సందర్భంగా అమ్రాబాద్ మండల కేంద్రంలో మహిళా సంఘాలకు రూ.4.5 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు జరిగింది.సర్పంచ్ చిగుర్ల కోటయ్య, డిప్యూటీ సర్పంచ్ రాజారాం, ఏపీఎం సైదులు, సీసీలు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు.

## శ్రీశైలంలో స్పర్శ దర్శనాల రద్దు

**నేటి నుంచి సోమవారం వరకు నిలుపుదల**



**శ్రీశైలం, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో స్పర్శ దర్శనాలను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో యం. శ్రీనివాసరావు ప్రకటించారు. నేటి నుంచి సోమవారం వరకు స్పర్శ దర్శనాలు ఉండవని, ఈ కాలంలో కేవలం స్వామివారి అలంకార దర్శనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. అయితే, ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందిన భక్తులకు మాత్రం యథావిధిగా స్పర్శ దర్శనాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యం, శాంతిభద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈవో వెల్లడించారు.

## ఇబ్రహీంపట్నం డిపో నుంచి సరస్వతి పుష్కరాల టూర్ ప్యాకేజీ

**కాళేశ్వరం దైవదర్శన యాత్ర -- భక్తులకు ప్రత్యేక సౌకర్యం**

**రంగారెడ్డి జిల్లా, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంత ప్రజలకు శుభవార్త. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా కాళేశ్వరం సరస్వతి పుష్కరాల దైవదర్శన టూర్ ప్యాకేజీను ప్రకటించారు.డిపో మేనేజర్ సుజాత వివరాల ప్రకారం, మే 31 ఆదివారం ఉదయం 5 గంటలకు మెట్రో డీలక్స్ బస్సు బయలుదేరి, కాళేశ్వరం సరస్వతి పుష్కరాల స్నానం అనంతరం ఆలయ దర్శనం చేసి, అదే రోజు రాత్రి 8 గంటలకు ఇబ్రహీంపట్నం చేరుకుంటుంది. ఈ యాత్రలో 30 మంది భక్తులు ఉంటే వారి దగ్గరికి బస్సు చేరే సౌకర్యం కల్పించబడుతుంది.భక్తులు కేవలం రూ. 1400/- చెల్లించి ఈ యాత్రలో పాల్గొనవచ్చు. అయితే టీ, టిఫిన్లు, దర్శనానికి సంబంధించిన ఇతర ఖర్చులు యాత్రికులు స్వయంగా భరించాల్సి ఉంటుంది.ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని డిపో అధికారులు కోరుతున్నారు. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన నంబర్: 9866336621

## నిర్మల్‌లో అరుదైన సంఘటన

**-- ఒకే డెలివరీలో ముగ్గురు శిశువులు**
**-వైద్యుల ప్రతిభతో తల్లి, శిశువులు సురక్షితం**




**నిర్మల్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో అరుదైన సంఘటన చోటుచేసుకుంది. ఓ మహిళ ఒకే డెలివరీలో ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. వైద్యుల వివరాల ప్రకారం, దాదాపు 8,000 మంది గర్భిణీలలో ఒకరికి మాత్రమే ఇలా ట్రిప్లెట్స్ జన్మించే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా వైద్యుడు డా. శశికాంత్ మాట్లాడుతూ, “తీవ్రమైన ప్రాణాపాయ స్థితిలో ఉన్న తల్లిని, ముగ్గురు నవజాత శిశువులను వైద్య బృందం అత్యంత ప్రతిభతో కాపాడగలిగింది” అని పేర్కొన్నారు.ఈ అరుదైన సంఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. తల్లి, శిశువులు ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఆరోగ్యంగా ఉన్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

# నేటి రాశి ఫలాలు





**మేషరాశి**
ఆరోగ్యపరంగా ఉపశమనం పొందుతారు. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలు రాణిస్తాయి. చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తిచేస్తారు. గృహమున చిక్కులు తొలగుతాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కుశ నామస్మరణ శుభకరం

**వృషభరాశి**
ఆత్మీయుల ప్రేమాభిమానాలు పొందుతారు.అవసరానికి ధనసహాయం లభిస్తుంది. పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు మరింత చికాకు పరుస్తాయి. కుజనామస్మరణ శుభకరం.

**మిథునరాశి**
చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. బంధువుల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలలో ఎంత కష్టించినా ఫలితం ఉండదు. వ్యాపారాలు అంతంత మాత్రంగానే సాగుతాయి. ఉద్యోగాలు నిరాశాజనకంగా ఉంటాయి. బుధ శ్లోకం శుభకరం

**కర్కాటకరాశి**
పబ్లిక్ లో మన్ననలు పొందుతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపారాలు గతం కంటే మెరుగ్గా ఉంటాయి. నూతన కార్యక్రమాలు చేపట్టి విజయం సాధిస్తారు. కుటుంబ విషయాలలో ఆప్తుల సలహాలు స్వీకరిస్తారు. ఉద్యోగాలలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది.

**సింహరాశి**
గృహనిర్మాణ ప్రయత్నాలలో ఆటంకాలు కలుగుతాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు మందగిస్తాయి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. ఉద్యోగాలలో సమస్యాత్మక వాతావరణం ఉంటుంది. పితృదేవత స్మరణ శు భకరం.

**కన్యా రాశి**
ఊహించని ఆర్థిక లాభాలు కలగవచ్చు ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. దీర్ఘకాలిక సమస్యల నుంచి బయటపడతారు. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగాలలో మరింత రాణిస్తారు. శివనామస్మరణ శుభకరం

**తులరాశి**
వృత్తి వ్యాపారాలలో స్థిరత్వం ఉండాలి కుటుంబ పెద్దలతో చిన్నపాటి వివాదాలు జరుగుతాయి. ఇంటాబయట కొందరి ప్రవర్తన మానసిక చికాకు కలిగిస్తుంది. బంధువర్గం నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. వ్యాపారమున పెట్టుబడుల విషయంలో పునరాలోచన చేయటం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి.
లక్ష్మీ నరసింహ స్తోత్రం శుభకరం.

**వృశ్చికరాశి**
ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. సన్నిహితులతో మాటపట్టింపులుంటాయి. కొన్ని వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు. వ్యాపారాలు కొంత మందగిస్తాయి. ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి.

**ధనస్సురాశి**
వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యులతో ఆలయ దర్శనాలు చేసుకుంటారు. బంధువులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. అనుకున్న పనుల్లో అవాంతరాలు తప్పవు. నూతన ఋణయత్నాలు చేస్తారు. వ్యాపార విషయంలో కొంత జాగ్రత్త అవసరం. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి పెరుగుతుంది. శివ పంచాక్షరి మంత్రం శుభకరం

**మకరరాశి**
స్నేహితులతో మాటపట్టింపులు ఉంటాయి. అవసరానికి చేతిలో డబ్బు నిల్వ ఉండదు. వాహన ప్రయాణ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు కొంత మందకొడిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది. శని స్తోత్రం శుభకరం

**కుంభరాశి**
చేపట్టిన పనులలో శ్రమాధిక్యత తప్పదు. ముఖ్యమైన పనులలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు.ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. మిత్రుల వలన ఊహించని సమస్యలు కలుగుతాయి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. శని అష్టకం పటిస్తే శుభకరం

**మీనరాశి**
చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ధన పరంగా చికాకులు తొలగుతాయి. నూతన వ్యక్తుల పరిచయాలు లాభసాటిగా ఉంటాయి. దూరపు బంధువుల నుండి శుభవార్తలు వింటారు. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వ్యాపారమున అనుకూలత కలుగుతుంది. నిరుద్యోగుల శ్రమ ఫలిస్తుంది. నవగ్రహ స్తోత్రం పటిస్తే శుభకరం

**(రాశి ఫలాలు నిపుణులు సలహాలతో పరిగణంలోకి తీసుకోండి)**



శ్రీకాల భైరవ ఉపవాసకులు
దక్క జంబులయ్య (స్వామి)
9491163914

## ప్రారంభోత్సవానికి సిద్ధమైన ప్రభుత్వ ఆసుపత్రి భవనం



**ఆమనగల్లు, మే 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనం నిర్మాణం పనులు పూర్తిచేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమైనది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో భవన నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా 17.50 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. మంజూరైన నిధులతో నిర్మాణం పనులకు జూలై 10, 2024 రోజున ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ వేగవంతంగా పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. గతంలో ఉన్న 33 పడకల ఆసుపత్రిని గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది పడకలకు కుదించగా పేద ప్రజలు వైద్య సేవల కోసం పడరాని పాట్లు పడ్డారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 10 పడకల ఆసుపత్రిని 50 పడగల ఆసుపత్రిగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసి ప్రారంభించండడంతో ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జూన్ నెలలో ఆసుపత్రి భవనం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో నాలుగు మండలాల ప్రజలు తమకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆనందం, ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## గిన్నిస్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సింగారి అనంతయ్యకు స్థానం

**హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ ప్రదర్శన**




**నందికొట్కూరు, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి సంగీత పోటీల్లో నందికొట్కూరు యువకుడు సింగారి అనంతయ్య అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల సమక్షంలో నిర్వహించిన కీబోర్డ్ వాయిద్య పోటీల్లో ఆయన ప్రతిభతో మెరిశారు.ఫిబ్రవరి 2, 2026న గచ్చిబౌలి విక్టోరియా ఆడిటోరియంలో జరిగిన ఈ బృహత్తర కార్యక్రమంలో 22 దేశాల నుండి దాదాపు 2 వేల మంది పాల్గొన్నారు. గంటపాటు నిరంతరంగా కీబోర్డ్ వాయించే పోటీలో 777 మంది ప్రతిభావంతులు ఎంపికయ్యారు. వారిలో సింగారి అనంతయ్య ఒకరుగా నిలిచి, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు.నందికొట్కూరు నివాసి అనంతయ్య, సింగారి శేషయ్య--గ్రేసమ్మ దంపతుల కుమారుడు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే సంగీతంపై ఆసక్తి పెంచుకుని, కీబోర్డ్ వాయిద్యంలో ప్రత్యేక పట్టు సాధించారు. ఆయన ప్రతిభను గుర్తించిన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు అగస్టిన్ దండింగి గిన్నిస్ ‘అచీవర్స్ మీట్’లో సర్టిఫికేట్ అందజేసి అభినందించారు.ఈ విజయంతో అనంతయ్యకు మిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. నందికొట్కూరు యువకుడు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటుకోవడం స్థానికులకు గర్వకారణంగా నిలిచింది.

నీలగిరి ఎక్స్‌ప్రెస్

శనివారం 30 మే 2026

# పీఎంజే జ్యువెలరీ రాబరీ కేసులో సూత్రధారి అరెస్టు



**కరీంనగర్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఈ నెల 3న కరీంనగర్ పట్టణంలోని పీఎంజే జ్యువెలరీలో జరిగిన సంచలన దోపిడీ కేసులో ప్రధాన నిందితుడు, సూత్రధారి సుభోధ్ సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు బీహార్ రాష్ట్రంలోని పూర్ణియా జైలు నుంచి ఆరు కోర్టుల పీటీ వారెంట్ల ఆధారంగా సుభోధ్ సింగ్‌ను కరీంనగర్‌కు తరలించారని. గురువారం రాత్రి ప్రత్యేక బృందం అతడిని కరీంనగర్‌కు తీసుకువచ్చి అర్ధరాత్రి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. అనంతరం కోర్టు రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.కేసు దర్యాప్తు మరింత లోతుగా కొనసాగించేందుకు నిందితుడిని వారం రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు సీపీ వెల్లడించారు.త్వరలో మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది అని ఆయన పేర్కొన్నారు.సుభోధ్ సింగ్ అరెస్టుతో పీఎంజే రాబరీ కేసులో కీలక మలుపు తిరిగింది.

# మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం




**కరీంనగర్ , మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుజురాబాద్ కరీంనగర్ ఎల్ఎండీ పంప్ హౌస్‌లో మోటర్ మరమ్మతుల కారణంగా హుజురాబాద్, హుస్నాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల మండలాలు, మునిసిపాలిటీలలో మిషన్ భగీరథ నీటి సరఫరా తాత్కాలికంగా నిలిచిపోయింది.ఈ నెల 30వ తేదీ సాయంత్రం నుంచి నీటి సరఫరా తిరిగి ప్రారంభమవుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈలోపు ప్రజలు ఆల్టర్నేట్ గ్రామపంచాయతీ లేదా స్థానిక నీటి వనరులను వినియోగించుకోవాలని ఆయన కోరారు.ప్రజలు సహకరించాలని మిషన్ భగీరథ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబర్దార్ అని జనసేన నేతల హెచ్చరిక




**హుస్నాబాద్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత ఆరోపణలు, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తే సహించబోమని జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ తగరపు శ్రీనివాస్ హెచ్చరించారు. హుస్నాబాద్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టులు, ప్రొఫెసర్లు, విశ్లేషకుల ముసుగులో కొంతమంది వ్యక్తులు పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. తెలంగాణ భావాల పట్ల ఆయన ఎల్లప్పుడూ గౌరవం చూపారు. గద్దర్‌తో ఆప్యాయతతో పలకరించేంత సాన్నిహిత్యం ఉంది అని అన్నారు. హైదరాబాద్ వరదల సమయంలో రూ.1 కోటి, కరోనా సమయంలో రూ.50 లక్షలు తెలంగాణ ప్రభుత్వానికి సహాయం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇటీవల కొండగట్టు అంజన్న దేవస్థానం అభివృద్ధికి రూ.35.19 కోట్లు మంజూరు చేయించారని వివరించారు.జనసేన పుట్టింది తెలంగాణ గడ్డ మీదే. పవన్ కళ్యాణ్ అడుగులు ఆపే దమ్ము ఎవరికీ లేదు అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జేరిపోతుల సంజీవ్, చిగురుమామిడి మండల ఇంచార్జ్ చిట్యాల సూరజ్, గంగారపు శ్రీకాంత్, కోడెం శ్రీకర్, అంబటి శ్రీకాంత్, తరిగొప్పుల సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబర్ధార్ అని జనసేన నేతలు హెచ్చరించారు.

## కేంద్ర గ్రంథాలయ పనులను పరిశీలోంచిన మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నూతనంగా నిర్మిస్తున్న కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, మేయర్ కొలగాని శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ మల్లేశం శుక్రవారం పరిశీలించారు. అధికారులు అత్యాధునిక డిజిటల్ లైబ్రరీ, చిన్నారుల కోసం ప్రత్యేక చిల్డ్రన్స్ లైబ్రరీ, విశాలమైన రీడింగ్ హాల్, సెమినార్ హాల్, పోటీ పరీక్షల అభ్యర్థుల కోసం ప్రత్యేక ఈ-లెర్నింగ్ సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పనులను వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. కరీంనగర్ ప్రజలకు ఆధునిక సౌకర్యాలతో కూడిన కేంద్ర గ్రంథాలయం త్వరలో అందుబాటులోకి రానుంది.

# ఐదు రోజుల్లోనే మొత్తం ధాన్యం కొనుగోలు

**--రైతులు అధైర్యపడవద్దు**
**-- మర్రిగూడ తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు**



**మర్రిగూడ, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల కేంద్రంలో రైతులు ఏ ఒక్కరూ అధైర్యపడవద్దని, కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు హామీ ఇచ్చారు.శుక్రవారం ఆయన యరగండ్లపల్లి గ్రామంలోని ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "మండలంలోని ఆరు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న 18 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని ఐదు రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేస్తాం. లారీలు, హమాలీల కొరత ఉన్నది వాస్తవమే కానీ ఇప్పుడు అదనంగా సిబ్బందిని నియమించాం. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడవద్దు" అని తెలిపారు.ఇప్పటికే మూడు రోజులలో 9 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసి, రామ్‌రెడ్డి పల్లి సమీపంలోని ఏఎంసీ గోదాంలో దిగుమతి చేసినట్లు ఆయన వివరించారు. ఐకెపి కేంద్ర నిర్వాహకులు తరగతిగా రెండు మూడు రోజుల్లో కొనుగోలు పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో ఐకెపి సిబ్బంది, వీఈవోలు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా అవగాహన సమావేశాలు




**కరీంనగర్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో విడివిడిగా సమీక్షా సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు మాజీ ఎమ్మెల్యే, పిసిసి సమన్వయకర్త కూన శ్రీశైలం గౌడ్ హాజరయ్యారు.నాయకులు బూత్ స్థాయి బలోపేతం, బిఎల్ఏ-2ల నియామకం, ఓటర్ మ్యాపింగ్‌పై దిశానిర్దేశం చేశారు. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం, రుణమాఫీ, బోనస్, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఉద్యోగాల భర్తీ వంటి పథకాలతో ప్రజలకు వెన్నుదన్నుగా నిలుస్తోందని వివరించారు.కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ఓటర్ సవరణలో అప్రమత్తంగా ఉండాలని, బిజెపి అనుకూల ఓటర్లను తొలగించే ప్రయత్నం చేస్తోందని హెచ్చరించారు. ప్రతి బూత్‌లో కనీసం ఐదుగురు సభ్యులు బాధ్యత తీసుకుని ఓటర్ మ్యాపింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.అంజన్ కుమార్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో సర్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఇప్పటికే కార్పొరేషన్ పరిధిలో బిఎల్ఏ-2ల నియామకం పూర్తయిందని, వారికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశాల్లో పిసిసి ప్రతినిధులు, గ్రంథాలయ చైర్మన్, ఏఎంసి చైర్మన్, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.సర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఓటర్లను కాపాడుకోవాలని కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు.

# 20 ఏళ్ల కష్టం అగ్నికి ఆహుతి



**హుస్నాబాద్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎల్కతుర్తి మండలం అరెపల్లి గ్రామానికి చెందిన రైతు మాటూరి విద్యాసాగర్ 20 సంవత్సరాలుగా శ్రమించి పెంచుకున్న టేకు వనం అగ్నిప్రమాదంలో దగ్ధమవడం బాధాకరమని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ అన్నారు. కుటుంబ భవిష్యత్తుతో పాటు పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా టేకు మొక్కలను పెంచిన విద్యాసాగర్ కృషి ఒక్క ప్రమాదంతో బూడిద కావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. వందలాది చెట్లు అగ్నికి ఆహుతి కావడంతో రైతు తీవ్ర ఆర్థిక నష్టం, మనోవేదనకు గురయ్యారని తెలిపారు. జిల్లా కలెక్టర్, అటవీ శాఖ అధికారులు వెంటనే సంఘటనా స్థలాన్ని సందర్శించి నష్టాన్ని అంచనా వేయాలని, ప్రత్యేక నష్టపరిహారం ప్రకటించి తిరిగి టేకు మొక్కల పెంపకానికి ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.రైతుల కష్టాన్ని గుర్తించి మానవతా దృక్పథంతో స్పందించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేశారు.

## నల్ల శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన జేఏసీ నాయకులు



**కరీంనగర్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తాసిల్దార్‌గా పనిచేసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన నల్ల శ్రీనివాస్ రెడ్డిని కరీంనగర్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదోన్నతులు పొందాలని, ప్రజలకు, ఉద్యోగులకు మరింత సేవలు అందించాలని నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపెల్లి కాళీ చరణ్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గడ్డం సుధాకర్, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పెండ్యాల కేశవరెడ్డి, మహిళా చైర్మన్ ఇరుమల్ల శారద, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.పదోన్నతి పొందిన నల్ల శ్రీనివాస్ రెడ్డికి జేఏసీ నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణలో బి.పి.ఇడి., డి.పి.ఇడి. ప్రవేశ పరీక్షలు




**కరీంనగర్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
2026--27 విద్యాసంవత్సరానికి బి.పి.ఇడి., డి.పి.ఇడి. కోర్సుల ప్రవేశాల కోసం తెలంగాణ శారీరక విద్య ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టిజి పిఇసెట్--2026) మే 31 నుంచి జూన్ 3 వరకు శాతవాహన విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో జరుగుతుంది.శారీరక సామర్థ్య పరీక్షలు, నైపుణ్య పరీక్షలు నిర్వహించబడతాయని చైర్మన్ ఉమేష్ కుమార్, కన్వీనర్ రాజేష్ కుమార్ తెలిపారు. మొత్తం 3305 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. వీరిలో బి.పి.ఇడి.కి 2342, డి.పి.ఇడి.కి 963 మంది దరఖాస్తు చేశారు.మొదటి రెండు రోజులు పురుషుల పరీక్షలు, తరువాతి రెండు రోజులు మహిళల పరీక్షలు జరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 15 కళాశాలల్లో 1560 బి.పి.ఇడి. సీట్లు, 3 కళాశాలల్లో 300 డి.పి.ఇడి. సీట్లు అందుబాటులో ఉన్నాయి.మే 31 ఉదయం 6.30 గంటలకు శాతవాహన విశ్వవిద్యాలయంలో జరిగే ప్రారంభోత్సవానికి ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిస్తారెడ్డి, వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్ హాజరవుతారు. తాత్కాలిక ఫలితాలు జూన్ 6న ప్రకటించబడతాయి.టిజి పిఇసెట్--2026 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా శారీరక విద్యా కోర్సుల్లో ప్రవేశాలు జరగనున్నాయి.

## ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విక్రయాలకు దరఖాస్తులు ఆహ్వానం

**సిద్దిపేట, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
2026--27 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విక్రయానికి ఆసక్తి గల బుక్ షాపు యజమానుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.పట్టణ, మండల పరిధిలోని బుక్ షాపులు మే 30 నుంచి జూన్ 5లోగా ఇండెంట్ సమర్పించాలి. రూ.1000 డిమాండ్ డ్రాఫ్ట్‌తో పాటు గత అనుమతి పత్రాలు, మిగిలిన స్టాక్ వివరాలు, మున్సిపాలిటీ లేదా గ్రామపంచాయతీ అనుమతి పత్రాలు, లేబర్ అధికారుల అనుమతి, సేల్స్ టర్నోవర్, సేల్స్ టాక్స్ రసీదులు జతపరచాలని సూచించారు.అన్ని పత్రాలు 2026--27 సంవత్సరానికి చెల్లుబాటు అయ్యేలా ఉండాలని, ఇతర వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.పాఠ్యపుస్తకాల విక్రయానికి ఆసక్తి గల వారు గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని విద్యాశాఖ విజ్ఞప్తి చేసింది.

## శాతవాహన యూనివర్సిటీలో మైనింగ్ ఇంజనీరింగ్ కోర్సు మంజూరు చేయాలని డిమాండ్




**హుస్నాబాద్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ మైనింగ్ ఇంజనీరింగ్ కోర్సు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బొగ్గు తవ్వకాల కార్యకలాపాలు అధికంగా ఉండటంతో మైనింగ్ ఇంజనీర్లకు డిమాండ్ పెరుగుతోందని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో కోర్సుల అవకాశాలు తక్కువగా ఉండటం వల్ల ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. హుస్నాబాద్ ప్రాంతం గనుల పరిశ్రమలకు సమీపంలో ఉండటంతో ఈ కోర్సు ప్రవేశపెట్టడం విద్యార్థులకు ఉపయోగకరమని, అవసరమైన సిబ్బంది నియామకాలకు కూడా అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు. శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో మైనింగ్ ఇంజనీరింగ్ కోర్సు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పనివేళల పెంపు

**కరీంనగర్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పనివేళలను పొడిగిస్తూ రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై కార్యాలయాలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు పనిచేస్తాయని జిల్లా రిజిస్ట్రార్ బండ ప్రవీణ్ కుమార్ తెలిపారు. భూముల మార్కెట్ విలువలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్ల రద్దీని దృష్టిలో ఉంచుకుని జూన్ 3 వరకు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రిజిస్ట్రేషన్ శాఖ విజ్ఞప్తి చేసింది. పనివేళల పెంపుతో రిజిస్ట్రేషన్ల రద్దీ తగ్గే అవకాశం ఉంది.

## నిరుపయోగంగా వెజిటేబుల్ మార్కెట్



**కరీంనగర్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చైతన్యపురి కాలనీలో లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన వెజిటేబుల్ మార్కెట్ షెడ్డు మూడు సంవత్సరాలుగా వినియోగంలోకి రాకపోవడంతో నిరుపయోగంగా మారింది. స్థానికులు చెబుతున్న ప్రకారం, రాత్రివేళల్లో ఇది అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వ్యాపారులు ప్రధాన రోడ్డుపై ఎండలోనే కూరగాయల అమ్మకాలు కొనసాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, లక్షలు ఖర్చు చేసి నిర్మించిన ఈ మార్కెట్‌ను ప్రజల వినియోగానికి అందుబాటులోకి తేవాలని చైతన్యపురి కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్ఐఆర్ అవగాహన సదస్సు



**కరీంనగర్ , మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, గ్రామ గ్రామాన ఎస్ఐఆర్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని, పోలింగ్ బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత ముఖ్యమని, బీజేపీ చేస్తున్న చర్యలకు ప్రతిస్పందనగా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల ఓటు హక్కును కాపాడాలని పిలుపునిచ్చారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, వైస్ ఛైర్మన్ అంజలి, కౌన్సిలర్లు, జిల్లా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, దేవస్థాన చైర్మన్లు, మండల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ విభాగాల నేతలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని ఓటు హక్కును కాపాడాలని కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు.

## పదోన్నతి పొందిన అధికారులకు ఘన సన్మానం



**కరీంనగర్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వాసుదేవా హాస్పిటల్, అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాసేవలో విశిష్ట సేవలందిస్తూ ఇటీవల పదోన్నతి పొందిన అధికారులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పెద్దపెల్లి ఆర్డీఓగా పదోన్నతి పొందిన రాజేశ్వరి, సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన వీర తిరుపతిని శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమం భగత్‌నగర్‌లోని ఆర్డీఓ నివాసంలో జరిగింది. డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న అధికారులను గుర్తించి సన్మానించడం అలయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పదోన్నతి పొందిన అధికారులు ప్రజలకు మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ కొంజర్ల మహేష్, పుల్లల శ్యామ్, సుద్దపెల్లి ప్రసాద్, సాగర్ రెడ్డి, పండుగ నాగరాజు, సుధాకర్, ఆనంద్ శర్మ, ఇంజనీర్ కొల అన్నారెడ్డి, ఇంజనీర్ ఈద కుమారస్వామి, నాగేశ్వర్, వెంకటేశ్వర్లు మరియు పలువురు పాల్గొన్నారు. పదోన్నతి పొందిన అధికారులకు ఘన సన్మానం అందజేయడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

## ఘనంగా మహిళా వారోత్సవాలు



**కరీంనగర్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రామడుగు మండలం కోరుటపల్లి అంగన్వాడీ కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ మహేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లలు తప్పకుండా సేవలు వినియోగించుకోవాలని సూచించారు. సిడిపిఓ నర్సింగరాణి మాట్లాడుతూ పోషకాహారం, బాల్య వివాహాల నివారణ, 1000 డేస్ ప్రోగ్రాం, సఖి, ఐసిపిఎస్ సేవలు, 181, 1098 టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించారు. 3--6 సంవత్సరాల పిల్లలను తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి పంపాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరి, సిడిపిఓ నర్సింగరాణి, సూపర్వైజర్ రేణుక, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఆరోగ్య సిబ్బంది, గ్రామ ప్రజలు, అంగన్వాడీ టీచర్ అమృత, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా మహిళా, బాలల సంక్షేమానికి అవగాహన కల్పిస్తూ వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి.

## అక్రమ నిర్మాణాలపై బాధితుల ఆవేదన




**పెద్దపల్లి, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: ప్రభుత్వం కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని బాధితులు మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. రామంచ అనసూర్య పురుషోత్తం దంపతులు తెలిపారు 1986లో కూనారాం రోడ్ (బీఎన్ కాలనీ)లో ప్రభుత్వం వారికి ప్లాట్ కేటాయించిందని, ఆ స్థలంలో పిల్లర్స్ వరకు నిర్మాణం చేసి ఆర్థిక ఇబ్బందుల కారణంగా పనులు నిలిపివేశారని చెప్పారు. తరువాత ఆ స్థలాన్ని అమ్మేందుకు ఒప్పందం చేసుకున్నప్పటికీ, కొనం సదానందం డబ్బులు చెల్లించకుండా జేసీబీతో నిర్మాణాలు ప్రారంభించాడని వాపోయారు. పెద్దపల్లి పోలీస్‌స్టేషన్, మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా, రాత్రివేళల్లో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. బయ్యానగా ఇచ్చిన రూ.2 లక్షలు తిరిగి ఇస్తే సరిపోతుంది, లేకపోతే మిగిలిన మొత్తం చెల్లించి ప్లాట్ తీసుకోవాలి. కానీ అక్రమంగా నిర్మాణాలు చేయడం ఆపి, నాకు న్యాయం చేయాలి అని బాధితులు కోరారు. అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి, న్యాయం చేయాలని బాధితులు అధికారులను విజ్ఞప్తి చేశారు.

## ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన అరుణ్ కుమార్‌కు ఘన సన్మానం



**కరీంనగర్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రెండవసారి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన కొరివి అరుణ్ కుమార్‌ను జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మహిళా, బీసీ, కిసాన్, మైనారిటీ సెల్ నేతల సమక్షంలో ఆయనకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, బీసీ సెల్ అధ్యక్షుడు పులి అంజనేయులు, కిసాన్ సెల్ అధ్యక్షుడు పురం రాజేశం, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ తాజ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రవణ్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే సిరిపురం నాగప్రసాద్, సిరిపురం లావణ్య, అబ్దుల్ రహమాన్, అబ్దుల్ అమీర్, గోపాల్ రెడ్డి తదితరులు కూడా సత్కారంలో పాల్గొన్నారు. నేతలు మాట్లాడుతూ అరుణ్ కుమార్ నాయకత్వంలో జిల్లా ఎస్సీ విభాగం మరింత బలోపేతం అవుతుందని ఆకాంక్షించారు. అరుణ్ కుమార్ సత్కారంతో జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఉత్సాహభరితంగా మారింది.

## నగర అభివృద్ధికై పలు పనులకు శ్రీకారం చుట్టిన మేయర్ కోలగాని శ్రీనివాస్



**కరీంనగర్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నగరంలోని 38వ డివిజన్‌లో సి.ఎస్.ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మేయర్ కోలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం రూ.10.80 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 39వ డివిజన్‌లో రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, కల్వర్టు పనులకు కూడా మేయర్ శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రతి డివిజన్‌లో కార్యక్రమాలు కొనసాగుతున్నాయని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్లు దేవసాని సరస్వతి--సత్యనారాయణ, మాసం గణేష్, ఎన్నం లక్ష్మి--ప్రకాష్, గాజ రామ--శివరాం, కె.ఎపిపి చంద్ర, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు. నగర అభివృద్ధి కోసం మౌలిక వసతుల పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

## మహిళా, బాలల సంక్షేమ అవగాహన సదస్సు




**కరీంనగర్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చామనపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఈ సి సి ఈ డే కార్యక్రమం నిర్వహించారు. చిన్నారి సమగ్ర అభివృద్ధి, పోషణ, ఆరోగ్యం, ప్రారంభిక విద్య, సురక్షిత వాతావరణం, తల్లిదండ్రుల భాగస్వామ్యం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని సీడీపీఓ సబిత తెలిపారు. పిల్లలు నేర్చుకున్న పాటలు ప్రదర్శించగా, మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, రక్తహీనత నివారణకు పి హె సి లలో హెల్త్ చెక్ అప్స్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోగొండ ఐలయ్య, కార్యదర్శి మహేందర్ రావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజమణి, డిపిఓ రోమిలా, అంగన్వాడీ టీచర్లు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చామనపల్లిలో మహిళా వారోత్సవాలు అవగాహనతో విజయవంతంగా ముగిశాయి.

### ప్రొఫెసర్ నాగేశ్వరరావు రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ను కండిస్తూ ఆదిలాబాద్ అండ్ పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జ్ మంథని సంపత్



**పెద్దపల్లి ̄ మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఈరోజు పెద్దపల్లి పార్లమెంటరీ ఇంచార్జ్ మంతిని సంపత్ మాట్లాడుతూ నాగేశ్వర్ రావు సొంత మండలమైన మందమర్రిలో నిర్వహించడం జరిగింది. ఈ కారిక్రమంలో మాయ రమేష్, ఆవుల సాగర్, పిట్టల సుధాకర్, వొడ్డనల హరీష్, ఎర్రోజుల సదానందం, మేకల పవన్ కళ్యాణ్, ముక్తా అవినాష్ IT కోఆర్డినేటర్ మరియు పార్టీ నాయకులు కార్యకర్తల సమావేశంలో పాలుగొన్నారు.

## శ్రీ సీతారాముల ఆలయ నిర్మాణానికి ముస్లిం సోదరుడి విరాళం

**మర్రిగూడలో మతసామరస్యానికి ప్రతీక**



**మర్రిగూడ, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని శ్రీ భక్త ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో నిర్మాణం జరుగుతున్న శ్రీ సీతారాముల వారి ఆలయానికి ముస్లిం సోదరుడు సయ్యద్ జానీ పాషా తన వంతు సహకారం అందించారు. వట్టిపల్లి గ్రామానికి చెందిన పాన్ షాప్ నిర్వాహకుడు అయిన ఆయన, ఆలయ నిర్మాణం కోసం రూ. 11,116/- నగదును ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు.ఈ సందర్భంగా మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన సయ్యద్ జానీ పాషాను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఆయన చేసిన ఈ విరాళం గ్రామంలో సోదరభావానికి, ఐక్యతకు నిలువెత్తు ఉదాహరణగా నిలిచింది.కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మకొండ విఠల్ రెడ్డి, పందుల రాములు గౌడ్, చెరుకు శ్రీరామ్ గౌడ్, కులుకులపల్లి యాదయ్య, మర్రిగూడ ఉప సర్పంచ్ మహేశ్వరం రమేష్, నల్ల శేఖర్, కోడాల అల్వాల్ రెడ్డి, పగడాల లింగయ్య, రాజేందర్ నాయక్, గుణగంటి యాదయ్య, బురుగు నాగరాజు, గుప్త గ్యార గోపాల్, బండ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## నందమూరి తారకరామారావు విగ్రహా ఆవిష్కరణ

**పగిడ్యాల మండల ప్రాతకోట గ్రామంలో ఘన కార్యక్రమం**



**నందికొట్కూరు, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు నియోజకవర్గంలోని పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామంలో గ్రామ నాయకుల ఆహ్వానం మేరకు ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని గురువారం ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య ముఖ్య అతిథులుగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు.గ్రామ ప్రజలు, పగిడ్యాల మండల నాయకులు, టిడిపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, నందమూరి తారకరామారావు సేవలను స్మరించుకున్నారు. ఆయన తెలుగు ప్రజలకు చేసిన సేవలు, రాజకీయ, సినీ రంగాల్లో చూపిన ప్రభావాన్ని గుర్తుచేసుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు.

## నందికొట్కూరులో డివైడర్లు, సెంటర్ లైట్లు భూమి పూజ

**-పట్టణ అభివృద్ధి పనులకు శ్రీకారం**





**నందికొట్కూరు, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు పట్టణ అభివృద్ధి పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. కొత్త బస్టాండ్ నుండి శ్లోక స్కూల్ వరకు డివైడర్లు, సెంటర్ లైట్లు ఏర్పాటు చేయడానికి భూమి పూజను నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "2014 నుండి 2019 వరకు టిడిపి ప్రభుత్వం నందికొట్కూరు అభివృద్ధికి పునాది వేసింది. గత ఐదేళ్లుగా నిలిచిపోయిన పనులను ఇప్పుడు కూటమి ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ పట్టణ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి రూ. 3 కోట్లతో బిపిఎస్ ఎల్‌ఆర్ నిధుల కింద ఈ పనులు చేపట్టారు" అని తెలిపారు.మార్కెట్ యార్డ్ నుండి కొత్త బస్టాండ్ వరకు, శ్లోక స్కూల్ నుండి 340--సి వరకు రోడ్డు విస్తరణకు ప్రభుత్వానికి లేఖలు పంపినట్లు ఆయన వెల్లడించారు. "డివైడర్ ఏర్పాట్లు మూడు నెలల్లో పూర్తి చేస్తాం" అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, టిడిపి నాయకులు, పట్టణ సీఐ, మున్సిపల్ అధికారులు, పోలీసు సిబ్బంది, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి సౌర విద్యుత్ – ప్రత్యేక కార్యాచరణ

**గ్రామీణ ప్రాంతాల్లో అవగాహనతో పాటు వేగవంతమైన అమలు అవసరం**



**ఆళ్లగడ్డ/నంద్యాల, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో సౌరశక్తి వినియోగాన్ని గ్రామస్థాయికి విస్తరించి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు.శుక్రవారం ఆళ్లగడ్డ ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి పీఎం సూర్యఘర్ పథకం పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 100 శాతం సబ్సిడీతో సోలార్ ప్యానెల్స్ అందిస్తున్నాం. సాధారణ వర్గాలకు కూడా కిలోవాట్ ప్రాతిపదికన భారీ సబ్సిడీలు లభిస్తున్నాయి. మూడు కిలోవాట్ల సామర్థ్యం గల వ్యవస్థ సాధారణ గృహ అవసరాలకు సరిపోతుంది. నెలకు 300--360 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుంది" అని వివరించారు.నెట్ మీటరింగ్ విధానం ద్వారా వినియోగదారులు మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అందించవచ్చని, ప్రభుత్వం యూనిట్‌కు చెల్లింపులు చేస్తోందని తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు కల్పించడం వల్ల వినియోగదారులపై ఆర్థిక భారం తగ్గుతుందని, రుణ చెల్లింపులు పూర్తయిన అనంతరం 20--25 సంవత్సరాల పాటు ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రస్తుతం ఎస్పీడీసీఎల్ ర్యాంకింగ్స్‌లో జిల్లా 7వ స్థానం నుంచి 3వ స్థానానికి చేరుకుందని, ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ, "ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఎంపిక చేసిన 12 గ్రామాల్లో ప్రతి ఇంటికి సౌరశక్తి అందించడమే లక్ష్యం. మొదటి దశలో 100 మంది లబ్ధిదారులతో కార్యక్రమాన్ని ప్రారంభించి, ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉన్న గ్రామాలకు ప్రాధాన్యత ఇస్తాం. ఒక సంవత్సరంలో ఈ గ్రామాలను పూర్తిస్థాయి సోలార్ గ్రామాలుగా తీర్చిదిద్దుతాం" అని తెలిపారు.పీఎం కుసుం పథకం కింద జిల్లాలో దాదాపు 39 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టులు అమలు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇందుకోసం రూ.180 కోట్ల వ్యయ ప్రణాళిక సిద్ధం చేసినట్లు, ఇప్పటివరకు రూ.21 కోట్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు.ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగ ఉపాధ్యాయుల సర్వీస్ రికార్డుల ఆన్లైన్ నమోదు గడువు పెంచాలి

**ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం విజ్ఞప్తి**



**మర్రిగూడ, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉద్యోగ ఉపాధ్యాయుల సర్వీస్ రికార్డుల ఆన్లైన్ నమోదు, హెల్త్ కార్డుల గడువును మరో నెల రోజుల పాటు పొడిగించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కోశాధికారి ఉదావత్ లచ్చిరాం నాయక్ ప్రభుత్వాన్ని కోరారు.శుక్రవారం మర్రిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సమావేశమై ఈ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు జనాభా గణన విధుల్లో నిమగ్నమై ఉండడం వల్ల సకాలంలో ఆన్లైన్ నమోదు పూర్తి చేయలేకపోతున్నారని, అందువల్ల గడువును జూన్ 30 వరకు పొడిగించాలని ఆయన సూచించారు.అదేవిధంగా ఉద్యోగులకు అందించే హెల్త్ కార్డుల విధివిధానాలను పూర్తిగా రూపొందించిన అనంతరమే ఉపాధ్యాయుల వేతనాల నుంచి నగదు నినాయింపులు చేపట్టాలని డిమాండ్ చేశారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని తక్షణమే అమలు చేసి, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, పెన్షన్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి, అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కూడా విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో పిఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి మాస బాలరాజు, కృష్ణయ్య, శ్రీ రమణ, సభావత్ వెంకట్ కుమార్, కొండ శ్రీనివాస్, బాడి అంజయ్య తదితర ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ధ్యానం శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది

**పోలీసు సిబ్బందికి మూడు రోజుల ప్రత్యేక కార్యక్రమం**




**నంద్యాల, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా పోలీసులు నిరంతరం ప్రజల రక్షణ కోసం శ్రమిస్తూ తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారికి మానసిక ప్రశాంతత కల్పించేందుకు జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రత్యేక ధ్యాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.నంద్యాల పట్టణంలోని రామకృష్ణ పిజి కాలేజ్ ఆడిటోరియంలో పోలీసు సిబ్బందికి "హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ముఖ్య అతిథిగా హాజరై, "24 గంటలు ప్రజల రక్షణ కోసం శ్రమించే పోలీసులకు ఇటువంటి ధ్యాన, యోగా కార్యక్రమాలు అత్యంత అవసరం. ధ్యానం క్రమం తప్పకుండా సాధన చేస్తే జీవితంలో సానుకూలత పెరుగుతుంది. ఆలోచనా విధానం కూడా మారుతుంది. ఇది వ్యక్తిగతంగా, వృత్తిపరంగా అద్భుతమైన ప్రయోజనాలను అందిస్తుంది" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ కుమారి ఎం. జావళి, ఐపీఎస్, అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎన్. యుగంధర్ బాబు, రామకృష్ణ పిజి కాలేజ్ అధినేత రామకృష్ణారెడ్డి, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థకు చెందిన యోగా గురువులు, పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ధ్యాన ప్రక్రియలను అభ్యసించారు.

## వంగూరులో ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీలు

**రైతులకు నాణ్యమైన ఇన్‌పుట్లు అందించాలన్న సంకల్పం**



**వంగూరు, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంగూరు మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, స్థానిక ఎస్సై మాదవ రెడ్డితో కలిసి శుక్రవారం వ్యవసాయ ఇన్‌పుట్ దుకాణాలను తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో నకిలీ విత్తనాలు, ఎరువుల నిల్వలు, పురుగుమందుల ఉత్పత్తులను పరిశీలించడంతో పాటు డీలర్ల స్టాక్ రిజిస్టర్లు, బిల్ పుస్తకాలు, విక్రయ రికార్డులను పరిశీలించారు. డీలర్లు తప్పనిసరిగా సీడ్ చట్టం--1966, అత్యవసర వస్తువుల చట్టం--1955, ఎరువుల నియంత్రణ ఉత్తర్వు--1985, పురుగుమందుల చట్టం--1968 నిబంధనలను పాటించాలని ఆదేశించారు.అలాగే, దుకాణంలో లైసెన్స్‌ను స్పష్టంగా ప్రదర్శించడం, స్టాక్ బోర్డులను ఉంచడం, రైతులకు కొనుగోలు బిల్లులు ఇవ్వడం, రికార్డులను సక్రమంగా నిర్వహించడం వంటి అంశాలపై సూచనలు చేశారు. నకిలీ లేదా అనధికార వ్యవసాయ ఇన్‌పుట్ల విక్రయాలు జరిపిన పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందేలా చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

# బేటీ బచావో -- బేటీ పడావో

**-బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**



**దేవరకొండ మే 29.(నీలగిరి ఎక్స్ ప్రెస్).** నల్గొండ జిల్లా గుడిపల్లి మండలం లో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం అంగన్‌వాడీ-2 కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ప్రమీల, గ్రామ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తల్లిదండ్రులకు సూచించారు. బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కిశోర బాలికలకు ప్రోటీన్లు సమృద్ధిగా ఉండే పౌష్టికాహారం అందించాలని, వారి శారీరక మరియు మానసిక అభివృద్ధికి కుటుంబ సభ్యులు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.అనంతరం గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించి బాల్య వివాహాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. "బేటీ బచావో -- బేటీ పడావో" నినాదాలతో గ్రామంలో ప్రజలకు సందేశం అందించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు, మహిళలు మరియు యువత పాల్గొన్నారు.

# మహిళా అభివృద్ధి పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**– ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**




**ఆమనగల్లు, మే 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మహిళల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పురపాలికల్లో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 100 రోజుల కార్యక్రమాల్లో భాగంగా పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ఎమ్మెల్యే నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై 22 మహిళా స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ. 2కోట్ల 20 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అని పేర్కొన్నారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదిగి కుటుంబాలతో పాటు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్, ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ ఎనుమల్ల రమేష్, అనిత శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, కండె రంగయ్య, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పూసల సత్యం, ఎంగలి ప్రసాద్, దేవరశెట్టి మహేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, విజయ్ కుమార్, మెకానిక్ బాబా, కుమార్ గౌడ్, కొండల్ రెడ్డి, శివ, అశోక్ మరియు ఆర్.పి లు విజయలక్ష్మి, లక్ష్మీ, శ్రీరామ్, పుష్ప, స్వాతి, చంద్రకళ, అలివేలు, మంజుల, మనిషా తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి..

**- మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి**

**- కడ్తాలలో ఈదురుగాలులతో దెబ్బతిన్న మామిడి తోటలను పరిశీలించిన హార్టికల్చర్ అధికారి**



**ఆమనగల్లు, మే 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కడ్తాల్ మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షం, బలమైన ఈదురుగాలుల కారణంగా నష్టపోయిన మామిడి తోటలను శుక్రవారం హార్టికల్చర్ విస్తరణాధికారి శ్రవణ్ సందర్శించారు. స్థానిక తోటల్లో గాలివాన ధాటికి నేలరాలిన మామిడి కాయలను, విరిగిపడిన చెట్ల కొమ్మలను ఆయన నిశితంగా పరిశీలించారు. పంట నష్టం వివరాలను, నష్టపోయిన రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో జరిగిన పంట నష్టంపై సమగ్ర నివేదికను తయారు చేసి, తదుపరి చర్యల కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారి శ్రవణ్ రైతులకు హామీ ఇచ్చారు. హార్టికల్చర్ అధికారి పర్యటనలో పాల్గొన్న మండల కేంద్ర మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ.. చేతికొచ్చే దశలో ఉన్న మామిడి పంట ఈదురుగాలుల వల్ల నేలపాలవ్వడంతో రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారని పేర్కొన్నారు. ఎంతో పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంట కళ్లముందే నాశనమవ్వడంతో రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, దెబ్బతిన్న తోటలను పూర్తిస్థాయిలో అంచనా వేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి మామిడి రైతుకు తక్షణమే తగిన నష్టపరిహారం అందించి, ప్రభుత్వం వారిని అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక రైతులు బాలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యాదాద్రి కో-ఆప్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ బ్యాంక్ ప్రారంభోత్సవం



**పీర్జాదిగూడ, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పీర్జాదిగూడ బుద్ధానగర్ కాలనీ రోడ్ నెం.1లో యాదాద్రి కో-ఆప్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ బ్యాంక్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రజలకు విశ్వసనీయ ఆర్థిక సేవలు, భద్రమైన పెట్టుబడులు, సహకార స్ఫూర్తితో ముందుకు సాగాలనే లక్ష్యంతో ఈ బ్యాంకును ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి మాజీ బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై సంస్థను ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, "ప్రజల విశ్వాసంతో ముందుకు సాగే సహకార సంఘాలు సమాజ ఆర్థికాభివృద్ధికి కీలకం. పారదర్శకత, నమ్మకం, సేవాభావంతో పనిచేసే యాదాద్రి కో-ఆప్ క్రెడిట్ సొసైటీ ప్రజలకు మరింత చేరువ కావాలి" అని ఆకాంక్షించారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రముఖులు, ప్రజలు పాల్గొని సంఘానికి మద్దతు తెలిపారు.

# మాటు వేసి వ్యక్తి పై హత్యాయత్నం



**దేవరకొండ మే 29. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** చందంపేట మండలం, గన్నేర్లపల్లి గ్రామంలో గురువారం రాత్రి వ్యక్తి పై కర్రలతో దాడి వివరాలల్లోకి వెలితే మద్దెల ఎల్లయ్య రెండవ కుమారుడు మద్దెల లింగం, నా రెండవ కుమారుడైన మద్దెల లింగం, సుమారు పదిన్నర సంవత్సరాల క్రితం తన గ్రామానికి చెందిన ఒక ఆడ మనిషి తో పరిచయం ఉందని, ఈ సంబంధం తదనంతరం వారిద్దరి మధ్య అక్రమ సంబంధంగా మారిందనే విషయానికి సంబంధించి---కొండ్రపల్లి అనిల్ మరియు కొండ్రపల్లి గణేష్ లు --- లింగాన్ని ఏ విధంగానైనా చంపాలనే నిర్దిష్ట ఉద్దేశ్యంతో కలిసి కుట్ర పన్నారు. ఈ ప్రణాళిక ప్రకారం, గురువారం రాత్రి ---సాయంత్రం సుమారు 7:30 గంటలక లింగం తన మోటార్ సైకిల్ (హోండా షైన్, రిజిస్ట్రేషన్ నెం. టీఎస్ 07 ఎఫ్ టి 2836) పై ఎస్.సి. కాలనీ నుండి గన్నేర్లపల్లి గ్రామం వైపు ప్రయాణిస్తుండగా, అతను గ్రామం శివార్లలో ఉన్న ఒక చెరువు వద్దకు చేరుకున్నాడు. ఆ ప్రదేశంలో, దారి పక్కన మాటువేసి ఉన్న పై వ్యక్తులు, లింగం ఇంకా బైక్‌పై ఉండగానే అతన్ని అడ్డగించి, తమతో తెచ్చుకున్న కర్రలతో అతని తల, కాళ్లు మరియు శరీరంలోని ఇతర భాగాలపై విచక్షణారహితంగా కొట్టారు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న లింగం ను స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు అనంతరం ఆసుపత్రి కి తరలించారు.ఈ విషయంలోతండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించడమైంది అని ఎస్ ఐ తెలిపారు.

# బిడ్డ జీవితానికి బలమైన పునాది వెయ్యి రోజులు

**-ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్యకళ అవగాహన**



**ఎలిగేడు, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బిడ్డ జీవితానికి మొదటి 1000 రోజులు అత్యంత కీలకమని ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్యకళ అన్నారు. శుక్రవారం ధూళికట్ట అంగన్వాడి మూడవ కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని, తల్లులు, గర్భిణీలు, బాలింతలకు వెయ్యి రోజుల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలి. ఆకుకూరలు, పప్పుదినుసులు, పాలు వంటి ఆహార పదార్థాలు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. బిడ్డ పుట్టినప్పటి నుండి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలి. ఏడో నెల నుండి తల్లిపాలతో పాటు అదనపు పోషకాహారం అందించాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ప్రభావతి, భారతి, వెంకటమ్మ, రజితతో పాటు గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో ఈసీసీఈ డే



**ఆమనగల్లు, మే 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మండల పరిధిలోని మంగళపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం ఈసీసీఈ (ప్రారంభ బాల్య సంరక్షణ, విద్య) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ మౌనిక శివ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంగన్వాడీ టీచర్స్ మరియు గర్భిణి, బాలింత, చిన్న పిల్లలకు తమ అంగన్వాడి కేంద్రంలో ఉన్న బొమ్మలతో లబ్ధిదారులకు, పిల్లలకు ఉల్లాసం, ఆనందం కలిగించే బొమ్మల ఆటలు ఆడించే కార్యక్రమం చేశారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు పీ. పద్మ టి. పద్మ ఎస్. అనిత మాట్లాడుతూ.. రెండున్నర సంవత్సరాలు పూర్తైన పిల్లలను అంగన్వాడి కేంద్రంలో ప్రీ-స్కూల్లో చేర్చి ఆటపాటల ద్వారా విద్య బోధిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐదు సంవత్సరాలు పూర్తయిన పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పిస్తున్నామని తెలిపారు. అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు ఎలాంటి ఖర్చు లేకుండా పౌష్టికాహారం అందించడంతో పాటు పూర్వ గణితం, పూర్వ లిఖితం, పఠనం వంటి ప్రాథమిక విద్యా అంశాలను బోధిస్తూ పాఠశాలకు సంసిద్ధులను చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి సహాయకురాలు లక్ష్మమ్మ, వరమ్మ మరియు గర్భిణీలు, బాలింతలు, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి బాధ్యత పెంచుతుంది


**- ఏసీపీ జానకీ రెడ్డి**



**ఆమనగల్లు, మే 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రజలకు బాధ్యతగా సేవలు అందిస్తే సమాజంలో పోలీసులపై గౌరవం, మర్యాద మరింత పెరుగుతాయని ఏసీపీ జానకీ రెడ్డి తెలిపారు. కడ్తాల్ పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ గా పనిచేస్తున్న బాల్ రెడ్డి ఎస్ఐ గా పదోన్నతి పొందడంతో శుక్రవారం ఏసీపీ జానకీ రెడ్డి అభినందించి తన చేతులతో బాల్ రెడ్డికు ఎస్ఐ పట్టీలను అలంకరించి సీఐ సైద్ది రెడ్డి తో కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. పదోన్నతి అనేది కేవలం ఉత్సాహానికే కాదని, మరింత బాధ్యతను తీసుకొస్తుందని చెప్పారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు భరోసా, నమ్మకం కలిగించే విధంగా పని చేయాలని, నిరుపేద ప్రజలకు పోలీసులు అండగా నిలవాలని సూచించారు.

# నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, మే 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం అండగా నిలుస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యపరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే పార్టీలకు అతీతంగా నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో తల్లోజు రామకృష్ణ, మట్ట వెంకటయ్య గౌడ్, సుమన్ గౌడ్, రాజశేఖర్, కడారి అశోక్ తదితరులు ఉన్నారు.

# వరి కొయ్య కాలు కాల్చవద్దు


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



-భూమి వేడెక్కి సూక్ష్మజీవులు నశిస్తాయి
- దిగుబడి తీవ్రంగా తగ్గుతుంది

**ఎలిగేడు, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని పలు గ్రామాల శివారు ప్రాంతాల్లో రైతులు వరి కొయ్య కాలు కాల్చడం వల్ల వందల ఎకరాల్లో పశుగ్రాసం దగ్ధమవుతోంది. వ్యవసాయ బావుల వద్ద ఉన్నటువంటి కరెంటు మోటార్లు, వైర్లు కూడా నష్టపోతున్నాయి. హార్వెస్టర్ మిషన్‌తో పంట కోయడం వలన కొయ్య కాలు పొడవుగా మిగిలిపోతున్నాయి. దుక్కి దున్నే సమయంలో నాగాళ్లకు అడ్డుగా పడుతున్నాయని రైతులు వాటిని తగలబెడుతున్నారు. అయితే, ఈ విధానం వల్ల భూమిలోని నత్రజని, ఫాస్ఫరస్ వంటి పోషక పదార్థాలు తగ్గిపోవడంతో పాటు పంటకు


వ్యవసాయ అధికారి ఉమాపతి

ఉపయోగకరమైన సూక్ష్మజీవులు, రైతు మిత్ర పురుగులు నశిస్తున్నాయి. ఫలితంగా పంట దిగుబడి తీవ్రంగా తగ్గిపోతోంది. వ్యవసాయ అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టినా రైతుల్లో మార్పు కనిపించడం లేదు. అధికారులు సూచించినట్లుగా, కొయ్య కాలు కాల్చకుండా దుక్కిలో కలియదున్నితే అవశేషాలు రెండు వారాల్లోనే పోషక పదార్థాలుగా మారతాయి. ఒక ఎకరాకు దాదాపు టన్ను వరకు సేంద్రియ ఎరువు తయారవుతుంది. దీంతో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గి, రైతు పెట్టుబడి ఖర్చులు మిగులుతాయి. వ్యవసాయ అధికారి ఉమాపతి మాట్లాడుతూ, "వరి కొయ్య కాలు కాల్చడం వలన వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. భూమిలోని సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు మరణిస్తాయి. కొయ్య కాలు కాల్చకుండా దుక్కిలో దున్నితే పంట దిగుబడి పెరుగుతుంది" అని రైతులకు విజ్ఞప్తి చేశారు.

## కర్మ జీవి

-------------
-పాత పేపర్లను కొంటాను గానీ
పరీక్ష పేపర్లను అమ్మే
కపటిని కాదు
-రాసిన కాపీలు కొంటాను గానీ
సాఫ్ట్ కాపీలు అమ్మే
వేస్ట్ ఫెలో ని కాదు
-పాత పుస్తకాలు కొంటాను గానీ
మనుషుల మస్తకాలు మార్చే
మకిలిని కాదు
-ఇనుపసామాన్లు కొంటాను గానీ
ఉక్కు లాంటి వారిని సైతం
ముప్పులతో తుప్పు పట్టించే
తప్పుడు వెధవను కాదు
-విరిగిన కుర్చీలు కొంటాను గానీ
విరిసే మనసులు విరిచే
వంచకున్ని కాదు
-పాడైన కూలర్లు కొంటాను గానీ
ఏసీలలో కూర్చుని
ఎవరి కొంపలకు ఎసరు పెట్టను
-మీకు అక్కరకు రాని
సామాన్లు కొంటాను గానీ
నా అక్కర కొరకు
కపటుల అభ్యర్థన మేరకు
ఎందరో అభ్యర్థుల కఠోరశ్రమను
వ్యర్థం చేసే స్వార్థున్ని కాదు
-నా పొట్టకూటి కొరకు
జీవిత పోరాటం చేస్తాను గానీ
ఎంత తిట్టినా
ఎవరు కొట్టినా
మరొకరి పొట్ట కొట్టే
వట్టి మనిషిని కాదు
-మీకు నచ్చి సామాన్లిస్తేనే
తగిన పైకం చెల్లిస్తా కానీ
కొందరి మైకం నిమిత్తం
ఎంత మొత్తం తగలేసినా
తగిన సరుకులు సమకూర్చే
నరకున్ని కాదు
-మురికి బట్టలు తొడిగి
ఇంటింటికీ తిరిగేది
నా వృత్తి ధర్మం
నీట్ గా రెడీ అయి
రెడీ అయిన నీట్ పేపర్ ను
లీక్ చేయడం వృత్తి ద్రోహం



Ch.శ్రీనివాస్
ఉపాధ్యాయుడు
ZPHS కనుకుల
స్వగ్రామం: ఎలిగేడు
( నేటి పోటీ ప్రపంచంలో పేపర్లు లీక్ చేస్తున్న దుర్మార్గులకు వ్యతిరేకంగా...)

## పదవ, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘన సన్మానం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం




**దేవరకొండ, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేవరకొండ నియోజకవర్గంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షత వహించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి దేవరకొండ డీఎస్పీ శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, "విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో లక్ష్యాన్ని పెట్టుకొని చదివితే ఉన్నత స్థాయికి ఎదిగి సమాజంలో పేరు, గౌరవం సంపాదించుకోవచ్చు. ఇలాంటి సన్మాన కార్యక్రమాలు విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తాయి. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు జరగాలని ఆకాంక్షిస్తున్నాను" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మాతృనాయక్, కొండ్ర శ్రీశైలం యాదవ్, ఏకుల రాజారావు, రెడ్డి కోటేశ్వరరావు, ఎండి రంజాన్ బెగ్, పున్న వెంకటేష్ నేత, నట్టువ సుధాకర్, గరిడి విజయభాస్కర్, పొన్నం బిక్షమయ్య, లౌద్య భాష నాయక్, ఏండి అబ్దుల్ కలాం, మెరుగు శ్రీను, వరికుప్పల శ్రీను, కుంభం బాలచందర్, మెరుగు పెద్దయ్య యాదవ్, పల్సా శ్రీనివాస్ గౌడ్తో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రిన్సిపల్స్, టీచర్లు, బీసీ సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సేన ఆధ్వర్యంలో జెండా పండుగ

దేవరకొండ నియోజకవర్గంలో ఘనంగా కార్యక్రమం



**దేవరకొండ, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ ఆధ్వర్యంలో ప్రతిపల్లెల్లో నిర్వహిస్తున్న జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా దేవరకొండ నియోజకవర్గంలో జెండా గద్దె నిర్మాణానికి అనుమతి కోసం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి విక్రాంత్ రెడ్డి, జిల్లా అబ్జర్వర్ దేవేందర్ రెడ్డి సమక్షంలో దేవరకొండ అసెంబ్లీ ఇన్‌చార్జి నేనావత్ శివ నాయక్ స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. దేవరకొండ అసెంబ్లీ ఇన్‌చార్జి నేనావత్ శివ నాయక్ మాట్లాడుతూ, "రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు ఆశించిన స్వరాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి దిశగా సాగాలి. పేదవాడి తలరాత మార్చే దిశగా, బడుగు బలహీన వర్గాలకు ఆసరాగా నిలిచే కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రంలో బిఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావడం మన బాధ్యత" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ అబ్జర్వర్ పల్లె నిషా, పార్టీ సీనియర్ నాయకులు మల్లయ్య, పున్ని బాయ్, మహిళా నాయకురాళ్లు పద్మ, భాగ్య, అలాగే సురేష్ నాయక్, అనిల్ కుమార్, ప్రశాంత్, నరేష్, రవి, సంపత్ తదితర బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధికి తోడ్పడడమే యూనియన్ బ్యాంక్ లక్ష్యం

నెల్లికుదురులో 300 మంది రైతులకు పవర్ స్ప్రేయర్ల పంపిణీ



**మహబూబాబాద్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతుల అభివృద్ధికి తోడ్పడటమే లక్ష్యంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుకొచ్చింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో 300 మంది రైతులకు ఫోర్ స్ట్రోక్ పవర్ స్ప్రేయర్లు పంపిణీ చేసింది. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై రైతులకు స్ప్రేయర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. రైతుల సమగ్ర ఆర్థికాభివృద్ధికి యూనియన్ బ్యాంక్ తోడ్పాటు ఇవ్వడం అభినందించాల్సిన విషయం. గ్రామీణ, గిరిజన ప్రాంత రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాలను అందించడం ద్వారా సాగులో శ్రమభారం తగ్గి సామర్థ్యం పెరుగుతుంది" అని అన్నారు. అనంతరం బ్యాంక్ జనరల్ మేనేజర్ బైజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, "సీఎస్ఆర్ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు బ్యాంక్ కట్టుబడి ఉంది. స్ప్రేయర్ల వినియోగం వల్ల సాగు ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరుగుతాయి" అని వివరించారు. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలో యూనియన్ బ్యాంక్ 9 శాఖల ద్వారా సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రీజినల్ హెడ్ జి. కమలాకర్, జిల్లా వ్యవసాయ అధికారి సరిత, సర్పంచ్ వెంకన్న, బిజెపి మండల అధ్యక్షుడు రాజు యాదవ్, బ్యాంక్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వినియోగదారుడి సమస్య పరిష్కరించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ

-హరీష్‌కు పరిహారం అందించిన కంపెనీలు




**మహబూబాబాద్, మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భార్యాభర్తల తగాదాలు, కుటుంబ కలహాలే కాకుండా వినియోగదారుల సమస్యలను కూడా రాజీమార్గంలో పరిష్కరించగలమని నిరూపించింది మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ. బయ్యారం మండలం, బయ్యారం గ్రామానికి చెందిన కందుకూరి హరీష్ ఆన్‌లైన్ ద్వారా రూ. 18,452 విలువగల థామ్సన్ ఫీనిక్స్ గూగుల్ టీవీని కొనుగోలు చేశారు. అయితే, ఇన్‌స్టాలేషన్ చేసిన మూడు రోజులకే టీవీ పనిచేయడం ఆగిపోయింది. మదర్‌బోర్డు దెబ్బతిన్నట్లు గుర్తించిన కంపెనీ మెకానిక్ దానిని భర్తీ చేస్తామని హామీ ఇచ్చినా, అమలు చేయలేదు. దీనిపై బాధితుడు పలుమార్లు వినియోగదారుల సేవా కేంద్రాన్ని సంప్రదించినా ఫలితం లేకపోవడంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాడు. కేసును పరిశీలించిన సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి షాలిని షాకెల్లి ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న కన్సల్టింగ్ రూమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు ఫ్లిప్‌కార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు స్పందించి, బాధితుడికి జరిగిన నష్టానికి పరిహారంగా రూ. 23,543 చెక్కును శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమక్షంలో హరీష్‌కు అందజేశారు. ఈ పరిణామం వినియోగదారుల హక్కులను కాపాడడంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని ప్రజలు అభినందించారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ.



**కూకట్పల్లి మే 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శంషిగూడ డివిజన్ పరిధిలోని ఆశ నగర్ కాలనీ హైటెన్షన్ రోడ్డులో సుమారు కోటి రూపాయల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ సహకారంతో డివిజన్ లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఆశనగర్ హైటెన్షన్ లైన్ లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గోపాల్, పోశెట్టిగౌడ్, లింగం, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.